క్లుప్తంగా

ఊకల్ సొసైటీ చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక



గీసుకొండ: మండలంలోని ఊకల్ సొసైటీ చైర్మన్‌గా పల్లార్లగూడ డైరెక్టర్ బొమ్మల రమేశ్, వైస్ చైర్మన్‌గా ఊకల్ డైరెక్టర్ మున్నంగి జనార్దన్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నిక కోసం జిల్లా సహకార అధికారి సంజీవ రెడ్డి శనివారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. 13 మంది డైరెక్టర్లకు 10 మంది హాజరయ్యారు. గతంలో చైర్మన్‌గా ఉన్న మండల వీరస్వామి, వైస్ చైర్మన్‌గా ఉన్న చల్లా కృష్ణారెడ్డితోపాటు మచ్చాపూర్ డైరెక్టర్ కక్కెర్ల శ్రీనివాస్ హాజరు కాలేదు. మెజారిటీ సభ్యులు బొమ్మల రమేశ్, మున్నంగి జనార్దన్‌రెడ్డికి ఓటు వేస్తూ ఏకగ్రీవంగా తీర్మానించడంతో వారి ఎన్నిక లాంఛనమైంది. కాగా, అప్పటి చైర్మన్ వీరస్వామి.. సొసైటీ డైరెక్టర్లు తనపై పెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని సవాల్ చేస్తూ కోర్టును ఆశ్రయించడంతో కొంతకాలం స్టే విధించింది. తాజాగా స్టే ఎత్తివేయడంతో ఎన్నికల ప్రక్రియ చేపట్టారు. ప్రస్తుతం ఎన్నికైన చైర్మన్ కాంగ్రెస్, వైస్ చైర్మన్ బీఆర్‌ఎస్‌కు చెందిన వారు. చైర్మన్, వైస్‌చైర్మన్‌ను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పరకాల నియోజకవర్గ అధికార ప్రతినిధి చాడ కొమురారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ సౌజన్య, పార్టీ నాయకులు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లో అక్రమాలపై పోలీసులకు ఫిర్యాదు

నల్లబెల్లి: నల్లబెల్లి ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘంలో రుణాల రెన్యువల్‌లో జరిగిన అక్రమాలపై రైతులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రగూడెం గ్రామానికి చెందిన నానబోయన రవి నల్లబెల్లి ఏపీజీవీ బ్యాంకులో పంట రుణం తీసుకున్నాడు. బకాయి రూ.1,04,143 బకాయి ఉంది. ప్రభుత్వం రూ.1.50 లక్షల వరకు ఇటీవల పంట రుణాలు మాఫీ చేసింది. మాఫీ వర్తించలేదు. అధికారులను సంప్రదించగా రవికి నర్సంపేట డీసీసీ బ్యాంకులో పంట రుణం రూ.2,09,536 బకాయి ఉన్నట్లు తెలిపారు. అదేవిధంగా రుద్రగూడెం తండాకు చెందిన భూక్యా రవి నర్సంపేట ఎస్‌బీఐలో రూ.80 వేలు రుణం తీసుకున్నా మాఫీ వర్తించలేదు. అధికారులను సంప్రదించగా నర్సంపేట డీసీసీ బ్యాంకులో రూ.1,47,078 బకాయి ఉన్నట్లు తెలిపారు. నల్లబెల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో అక్రమాలకు పాల్పడి తమకు పంట రుణాలు మాఫీ కాకుండా చేసిన బాధ్యులపై చర్య తీసుకోవాలని కోరుతూ పోలీసులకు వారు వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని ఎస్సై ప్రశాంత్‌బాబు తెలిపారు.

ఏఈఈ ఫలితాల్లో ప్రతిభ



నర్సంపేట : ఏఈఈ పరీక్ష ఫలితాల్లో నర్సంపేటకు చెందిన చిందం మనోహర్–ఉమ దంపతుల కుమారుడు వంశీ ప్రతిభ చాటి రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంకు సాధించాడు. ఆయన సివిల్ ఇంజనీర్ (మిషన్ భగీరథ ఏఈ) ఉద్యోగానికి ఎంపికయ్యాడు. వంశీని అతడి తల్లిదండ్రులు, బంధువులు, కుటుంబ సభ్యులు, స్థానికులు అభినందించారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి

వర్ధన్నపేట: విద్యుదాఘాతంతో కూలీ మృతి చెందిన ఘటన మండలంలోని కోనాపురం ఎస్సీ కాలనీలో చోటుచేసుకుంది. ఎస్సై కథనం ప్రకారం.. ఎలికట్టె భాస్కర్ (44) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం సాగరం గ్రామంలో బంధువుల ఇంటికి సైకిల్‌పై ఫంక్షన్ నిమిత్తం వెళ్లాడు. తిరిగి రాత్రి ఇంటికి చేరుకునే క్రమంలో వర్షం పడుతోంది. మార్గమధ్యలో మున్సిపాలిటీ బోరు వద్ద సర్వీస్ వైరు తెగిపడి సైకిల్‌కు చుట్టుకుని విద్యుదాఘాతానికి గురయ్యాడు. స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా భాస్కర్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, ఎమ్మెల్యే నాగరాజు వేర్వేరుగా భాస్కర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ఆర్థికసాయం

గీసుకొండ : మండలంలోని ఎలుకుర్తి హవేలికి చెందిన గ్రామ పంచాయతీ ఉద్యోగి మంద కుమారస్వామి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా నిమ్స్ లైజనింగ్ అధికారి డాక్టర్ మార్త రమేశ్ బాధిత కుటుంబానికి శనివారం రూ.5 వేల సాయం అందజేశారు. అనంతరం బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో రమేశ్ చిన్ననాటి మిత్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

‘స్వచ్ఛదనం-పచ్చదనం’ విజయవంతం చేయాలి

వర్ధన్నపేట : ఈనెల 5 నుంచి 9 వరకు నిర్వహించనున్న ‘స్వచ్ఛదనం–పచ్చదనం’ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మునిసిపల్ చైర్‌పర్సన్ అంగోతు అరుణ, మునిసిపల్ కమిషనర్ జోనా, ప్రత్యేక అధికారి సురేశ్‌కుమార్, ఎంపీడీఓ వెంకటరమణ ఆకాంక్షించారు. మండల పరిషత్, మునిసిపల్ కార్యాలయాల్లో అధికారులు కార్యకర్మ న్విహణపై శనివారం వేర్వేరుగా అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రోజూ వారి అంశాలపై అవగాహన కల్పించారు. పట్టణంలోని 12 వార్డులకు ప్రత్యేక అధికారులను నియమించారు. శానిటేషన్, మంచినీటి సరఫరా, మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమాల్లో ఎంపీఓ ధనలక్ష్మి, ఏఈ రాజేందర్‌రెడ్డి, ఏపీఓ నాగేశ్వర్‌రావు, మునిసిపల్ వైస్ చైర్మన్ ఎలేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు సమ్మెట సుధీర్, తోటకూరి రాజమణి, మంచాల రామకృష్ణ, తుమ్మల రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి : మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీఓ మాలోతు శంకర్ మాట్లాడారు. అధికారులు ప్రజలను కలుపుకుని గ్రామాల్లోని ప్రధానమైన 10 సమస్యలను గుర్తించి రోజువారీగా రోజువారీగా చేపట్టాల్సిన కార్యాచరణను వివరించారు. సమావేశంలో ఎంపీఓ పాక శ్రీనివాస్, ఏపీఓ, తదితరులు పాల్గొన్నారు.

సంగెం : మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన సదస్సులో ప్రత్యేక అధికారి వేదవతి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, యువజన, మహిళా సంఘాలు, స్వచ్ఛంధ సంస్థలు, అధికారులతోపాటు ప్రజలను భాగస్వాములను చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ రవీందర్, ఎంపీఓ కొమురయ్య పాల్గొన్నారు.

చెన్నారావుపేట : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో స్పెషల్ ఆఫీసర్లు, గ్రామపంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ప్రత్యేక అధికారి బాలాజీ మాట్లాడారు. కార్యక్రమ విజయవంతానికి ప్రతీఒక్కరు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ శ్రీవాణి, ఎంపీఓ శ్రీధర్‌రాజు, వైద్యాధికారి సరోజ, ఏపీఓ అరుణ, స్పెషల్ ఆఫీసర్లు మంగీలాల్, రాధిక, శశికాంత్, సీహెచ్‌ఓ భద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.



వర్ధన్నపేట : మాట్లాడుతున్న చైర్‌పర్సన్ అరుణ

ఖానాపురం : మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీఓ దేగల భారతి మాట్లాడారు. గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని తెలిపారు. సమావేశంలో ఎంపీఓ అంబటి సునీల్, ఏఓ బోగ శ్రీనివాస్, డాక్టర్ జ్యోతి, ఈసీ అరుణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకం ప్రారంభం



ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

చెన్నారావుపేట: సంజీవని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏటుకూరి రాయన్న–శాంతమ్మ దంపతుల జ్ఞాపకార్థం రూ.25 లక్షలతో తిమ్మరాయినిపహాడ్ గ్రామంలో ఎత్తిపోతల పథకం నిర్మించారు. పాకాల వాగు నుంచి మాసూరు గుట్టల వరకు రెండు కిలోమీటర్ల వరకు చేపట్టిన ఈ పథకాన్ని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దాత చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఫాదర్ ఎటుకురి రఫేల్ గతంలో 50 దళిత కుటుంబాలకు ఇళ్లు, ఎకరం భూమి ఇచ్చారని తెలిపారు. ఎత్తిపోతల పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు పెండెం రామానంద్, సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మండల అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్, నాయకలు మొగిలి వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి, తొగరు చెన్నారెడ్డి, సాధు మధుసూదన్‌రెడ్డి, కర్నాటి పార్వతమ్మ, మంద యాకయ్యగౌడ్, నన్నెబోయిన రమేశ్‌యాదవ్, మంచాల సదయ్య, సిద్దన రమేశ్, తప్పెట రమేశ్, తూటి పావని రమేశ్, భద్రునాయక్ పాల్గొన్నారు.

‘పెద్ది’ చొరవతోనే మెడికల్ కాలేజీ



సంబురాల సందర్భంగా మాట్లాడుతున్న వినయ్

నర్సంపేట : గతంలో ఎమ్మెల్యేగా పెద్ది సుదర్శన్‌రెడ్డి చూపిన చొరవతోనే నర్సంపేటకు మెడికల్ కాలేజీ మంజూరైందని బీఆర్‌ఎస్‌వీ డివిజన్ నాయకుడు సదిరం వినయ్ తెలిపారు. ప్రభుత్వం మెడికల్ కాలేజీ మంజూరు చేయడాన్ని హర్షిస్తూ ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని కాకతీయ కళాతోరణం వద్ద శనివారం టపాసులు పేల్చి, స్వీట్లు పంచి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వినయ్ మాట్లాడారు. నర్సంపేట ప్రాంతాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దడానికి పెద్ది సుదర్శన్‌రెడ్డి కృషి చేశారని చెప్పారు. కార్యక్రమంలో ఐక్యవిద్యార్థి సంఘాల నాయకులు అజయ్, బొట్ల నరేశ్, బీఆర్‌ఎస్‌వీ పట్టణ అధ్యక్షుడు దేవోజు హేమంత్, నాయకులు బాలకృష్ణ, సిద్దు, నల్ల రవీందర్, నరేశ్, ప్రశాంత్, వినోద్, రాకేశ్, రోషన్, శ్రీకాంత్, యశ్వంత్, రామకృష్ణ పాల్గొన్నారు.

ఊరూరా తల్లిపాల వారోత్సవాలు



సాక్షి నెట్‌వర్క్ : జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట, నల్లబెల్లి, నెక్కొండ, దుగ్గొండి, ఖానాపురం, చెన్నారావుపేట, తదితర మండలాల్లో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఊరూరా తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అన్నప్రాసన చేయించారు. పలు గ్రామాల్లో ర్యాలీలు తీశారు. ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు తల్లులకు తల్లిపాల ప్రాశస్త్యాన్ని వివరిస్తూ అవగాహన కల్పించారు.

శ్రావణ ఉత్సవాలను జయప్రదం చేయండి

నర్సంపేట : పట్టణంలోని శ్రీభూనీలా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించనున్న శ్రావణ మాసోత్సవాలను జయప్రదం చేయాలని అర్చకులు ముడుంబై రామానుజాచార్య కోరారు. ఆలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈనెల 7న అండాళ్ తిరునక్షత్ర మహోత్సవం, 11న ఉదయం 9 గంటలకు శ్రీసుదర్శన నారసింహ మహాయాగం నిర్వహిస్తామన్నారు. విద్య, ఉద్యోగం, ఉద్యోగ అభివృద్ధి, వ్యాపారం, వివాహం, సంతానం కోరుకుంటున్న భక్తులు యాగంలో భాగస్వాములు కావాలని కోరారు. అలాగే 16న సామూహిక వరలక్ష్మి వ్రతం, 17న ఉదయం 9 గంటలకు శ్రీభూనీలా సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తామని చెప్పారు. ఈనెల 24న ఉదయం 10 గంటలకు స్వామి వారికి లక్ష పుష్పార్చన, 27న సాయంత్రం 8 గంటలకు శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవం ఉంటాయని వివరించారు. ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఎర్ర జగన్ మోహన్‌రెడ్డి, సభ్యులు దుబ్బా రమేశ్, వేంశెట్టి శ్రీనివాస్, శింగిరికొండ రవీందర్, రామగోని సుధాకర్, బాల్నె సర్వేశం పాల్గొన్నారు.

మాక్ ఎలక్షన్స్‌తో అవగాహన

● చైర్మన్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి

నర్సంపేట రూరల్ : విద్యార్థులకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా మాక్ ఎలక్షన్స్ నిర్వహిస్తున్నట్టు బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి తెలిపారు. నర్సంపేట మండలం లక్నేపల్లి శివారులోని బాలాజీ టెక్నో స్కూల్‌లో శనివారం నిర్వహించిన మాక్ ఎలక్షన్స్‌ను ఆయన అతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. దేశ దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉంటుందని చెప్పారు. విద్యార్థి దశలోనే క్రమశిక్షణను అలవర్చుకుని ఉత్తమ పౌరులుగా ఎదిగే దిశగా ప్రణాళికాయుతంగా ముందుకు సాగాలని సూచించారు. అనంతరం బ్యాలెట్ పేపర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బాలాజీ టెక్నో స్కూల్ ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ఎలక్షన్స్‌ను ప్రారంభిస్తున్న రాజేంద్రప్రసాద్‌రెడ్డి

రేపటితో ముగియనున్న ‘రైతుబీమా’ గడువు

సంగెం : రైతుబీమా పథకంలో చేరడానికి రేపటి (ఈనెల 5)తో గడువు ముగియనుందని ఏఓ యాకయ్య ఒక ప్రకటనలో తెలిపారు. గత జూన్ 28 నాటికి పట్టాపాసు పుస్తకం పొందిన, గతంలో పట్టాపాసుపుస్తకం ఉండి రైతుబీమా చేయించుకోని 18 నుంచి 59 ఏళ్ల నడుమ వయస్సున్న రైతులు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తు ఫారాన్ని పూర్తి చేసి పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, నామిని ఆధార్ కార్డు జిరాక్స్‌లను సంబంధిత క్లస్టర్ ఏఈఓలకు అందజేయాలని సూచించారు.

సేవా రంగంలో ముందుండాలి

నర్సంపేట: సేవారంగంలో ముందుండాలని రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రాంప్రసాద్ సూచించారు. ఈ మేరకు పట్టణంలో శనివారం రోటరీక్లబ్ నూతన కార్యవర్గంతో ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. నర్సంపేట రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా తక్కళ్లపల్లి యుగేంధర్, కార్యదర్శిగా రాజశేఖర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాంప్రసాద్ మాట్లాడుతూ నర్సంపేట ప్రాంతంలో రోటరీక్లబ్ ద్వారా గతంలో అనేక సేవా క్యాక్రమాలు చేపట్టారన్నారు. అదే స్ఫూర్తితో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని రోటరీక్లబ్ సభ్యులు సన్మానించారు. అసిస్టెంట్ గవర్నర్ శ్రీనివాసులు, వైద్యనాథ్, నర్సింహయాదవ్, రంజిత్‌కుమార్, శివకుమార్, శ్రీలక్ష్మి, ఇరుకు కోటేశ్వర్‌రావు, ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తోట సంపత్‌కుమార్, భూపాల్, పవన్, వరుణ్, ప్రణయ్, రాజు, యాదగిరిరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతో సమన్యాయం



సంగెం : క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

సంగెం : ఎస్సీ వర్గీకరణతో అన్ని వర్గాలకు సముచిత న్యాయం లభిస్తుందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చాతాళ్ల రమేశ్ అన్నారు. మండలంలోని తిమ్మాపూర్‌లో ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ చిత్రపటానికి శనివారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రమేశ్ అతిథిగా హాజరై మాట్లాడారు. దశాబ్దాలుగా సాగించిన న్యాయపోరాటం ఫలించిందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు ముక్కెర రఘు, కోడూరి రాజు, ఇటికాల అనిల్, వర్కల ప్రదీప్, రవీందర్, క్రాంతి, రాజు, మధు, రాకేశ్, రవితేజ, సందీప్, యాకయ్య, శ్రీకాంత్, సాంబరాజు, భాస్కర్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి..

వర్ధన్నపేట : పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి అంబేడ్కరిజం జేఏసీ నాయకులు తుమ్మల శ్రీధర్, జన్ను ప్రభాకర్ పాలాభిషేకం చేసి పూలమాలలతో అలంకరించారు. అనంతరం ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు శ్రీధర్, ప్రభాకర్ మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయమని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ తాటికాయల భాస్కర్, సోమనాథం, మల్లెపాక భాస్కర్, కొండేటి భాస్కర్, యాకయ్య, కొండేటి మధు, రవి, అశోక్, నాగరాజు, శివ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టండి

చెన్నారావుపేట : గ్రామాల్లో సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టాలని తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు శివరాత్రి కుమారస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల్లో అధికారులకు శనివారం వినతిపత్రం అందజేశారు. అనంతరం కుమారస్వామి మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. అలాగే ఉపాధి హామీ పని చేసిన కూలీలకు వెంటనే డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో హెల్త్‌క్యాంప్‌లు నిర్వహించాలని, దోమల నివారణ మందు స్ప్రే చేయించాలని, తదితర సూచనలు చేశారు. కార్యక్రమంలో నాయకులు అందె లక్ష్మీనారాయణ, ఎలకంటి కుమారస్వామి, అందె నర్సింహారావు, వీరస్వామి, రాజు, నర్సింహారెడ్డి, ఐలయ్య, శివకోటి, తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో అలసత్వం తగదు

వర్ధన్నపేట : ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం అలసత్వం వహించడం తగదని సీపీఐఎంఎల్ మాస్ లైన్ (ప్రజాపంథా) జిల్లా కార్యదర్శి చిర్ర సూరి అన్నారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం తహసీల్ కార్యాలయంలో డీటీ వినయ్‌రెడ్డికి శనివారం వినతిపత్రం అందజేసింది. అనంతరం సూరి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ప్రజలకు ఆరుగ్యారంటీలతోపాటు అనేక హామీలు ఇచ్చిందని గుర్తు చేశారు. హామీలతో నమ్మించి ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా పథకాల అమలులో అలసత్వం వహించడం సరికాదన్నారు. సమావేశంలో నాయకులు మైదం పాణి, సాబిరికాని మోహన్, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు బోళ్ల రమేశ్, ఈదునూరి వెంకన్న, కట్ల వెంకట సాయిలు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీకి స్వర్గరథం అందజేత

చెన్నారావుపేట : మండలంలోని అమీనాబాద్ గ్రామానికి చెందిన చీర మల్లేశం–కళావతి దంపతులు వారి కుమారుడు రంజీత్ ఇటీవల మృతి చెందగా అతడి జ్ఞాపకార్థం గ్రామ పంచాయతీకి స్వర్గరథాన్ని శనివారం బహూకరించారు. అలాగే డప్పు కళాకారులకు టీ షర్టులు సొంత డబ్బుతో కొనుగోలు చేసి అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సిద్దన రమేశ్, మాజీ జెడ్పీటీసీ బానోతు పత్తినాయక్, అమీనామాద్ సొసైటీ చైర్మన్ మురహరి రవి, వివిధ పార్టీల నాయకులు బాల్నె వెంకన్న, బుర్రి తిరుపతి, అమ్మ రాజేశ్, కడారి సాయిలు, బండి హరీశ్, పంచాయతీ కార్యదర్శి నిట్టు, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

చెన్నారావుపేట : మండలంలోని అమీనాబాద్‌లో దయ్యాల శివలింగం మృతి చెందగా ఆయన మృతదేహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం లింగగిరి గ్రామానికి చెందిన దాసరి కట్టయ్య, గోనె వెంకటమ్మ, బోడ మాణిక్యంతండాకు చెందిన కాంగ్రెస్ నాయకులు భూక్య మోహన్ కుమారుడు జీవన్ నాయక్, కోనాపురం గ్రామానికి చెందిన తుమ్మలపల్లి రాజిరెడ్డి, పురం కొమురయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలను పరామర్శించారు.

దుగ్గొండి : మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రల్ల బాబును అతడి తండ్రి యాకయ్య ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో ఎమ్మెల్యే మాధవరెడ్డి పరామర్శించారు.

సంక్షిప్త సమాచారం

ఫ్రీఫైర్ మోజులో యువత..!



ఖానాపురం : యువత సెల్‌ఫోన్‌లో మునిగిపోతున్నారు. ఆటలు, ఇన్‌స్టాగామ్‌ల్లో గంటలకొద్దీ గడిపేస్తున్నారు. ఇక కొందరు సెల్‌ఫోన్‌ల్లో ఫ్రీఫైర్ ఆటలో నిమగ్నమవుతున్న దుస్థితి నెలకొంది. ఆట ఆడేందుకు ప్రత్యేకంగా చేతి వేళ్లకు గ్లౌస్‌లను సైతం కొనుగోలు చేసి ధరిస్తున్నారు. యువత పబ్జీకి బానిసగా మారుతున్నారా? అన్న ఆందోళన కలిగేలా చోటు చేసుకున్న దృశ్యాన్ని ‘సాక్షి’ కెమెరాలో బంధించింది. ఈ విషయమై ఆట ఆడుతున్న యువకులతో మాట్లాడగా ఫ్రీఫైర్ టోర్నమెంట్‌కు సిద్ధమవుతున్నామని చెప్పారు. వేళ్లతో ఆడితే ఇబ్బంది అవుతుందని గ్లౌస్‌లు సైతం కొనుగోలు చేసినట్లు తెలపడం కొసమెరుపు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి



వర్ధన్నపేట: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పరిసరాలు పరిశుభ్రంగా లేవని డీసీహెచ్ డాక్టర్ గోపాల్ అన్నారు. ఆస్పత్రిని శనివారం ఆయన సందర్శించి సూపరింటెండెంట్ నరసింహను మందలించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో వైద్య సేవలను పరిశీలించారు. పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అంతరాయం లేకుండా జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు. మరో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చెప్పారు.

బీమా చెక్కు అందజేత



గీసుకొండ : మండలంలోని మచ్చాపూర్‌లోని ఏపీజీవీ బ్యాంకు అధికారులు లబ్ధిదారుడు యాకూబ్ పాషాకు శనివారం రూ.2 లక్షల జీవన జ్యోతి బీమా చెక్కును అందజేశారు. తొలుత బ్యాంకులో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎఫ్ఎల్‌సీ కౌన్సిలర్ ఎం.ప్రేమ్ కుమార్, బ్యాంకు మేనేజర్ బి.స్వాతి, అకౌంటెంట్ పి.ప్రవంతి, బ్యాంకు మిత్ర జామపయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పర్వతగిరి : విద్యుత్ లైన్ నిర్వహణ పనుల నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాల్లో నేడు ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని ఆ శాఖ ఏడీ చంద్రమౌళి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చింతనెక్కొండ, ఏనుగల్, చౌటపల్లి, పర్వతగిరి సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో 33 కేవీ లైన్ నిర్వహణ పనులు చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. ఈ క్రమంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పాలాభిషేకం



నర్సంపేట : రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేసిన నేపథ్యంలో పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చిత్రపటాలకు శనివారం పాలాభిషేకం చేశారు. అలాగే మహిళా, విద్యార్థి సంఘాల నాయకులు పట్టణంలో సీఎం, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమాల్లో నాయకులు కావ్య, అనిత, భాగ్యశ్రీ, రమ్య, ప్రవళిక, శిరీష, రజిత, వెన్నెల అనూష, రూప, మధులత, సరిత, తదితరులు పాల్గొన్నారు.

కాసం కృష్ణమూర్తికి నివాళి

నర్సంపేట : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు కాసం కృష్ణమూర్తి చిత్రపటానికి ఆయన 18వ వర్ధంతి సందర్భంగా స్థానిక వ్యవసాయ కార్మిక సంఘం కార్యాలయంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి భూక్య సమ్మయ్య, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కోరబోయిన కుమారస్వామి శనివారం నివాళులర్పించారు. అనంతరం సమ్మయ్య, కుమారస్వామి మాట్లాడారు. కృష్ణమూర్తి గ్రామాల్లో దళాలు ఏర్పాటు చేసిన నిజాం వ్యతిరేక పోరాటాలు నిర్మించారని కొనియాడారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నమిండ్ల స్వామి, జిల్లా నాయకురాలు మొఘలోజు శారద, రుద్రారపు లక్ష్మి, మాదాసి శ్రీను, గట్ల నర్సింహారావు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి తేలుకాటు

చెన్నారావుపేట : పంచాయతీ కార్యదర్శికి తేలు కుట్టింది. ఈ ఘటన మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలిలా.. చెన్నారావుపేట గ్రామ ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శిగా కాల్‌నాయక్ తండా పంచాయతీ కార్యదర్శి గొడిశాల వికాస్ గౌడ్ కొద్దిరోజులుగా విధులు నిర్వర్తిస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా ఆయన కారోబార్ కుసుమ సురేశ్‌తో కలిసి స్మశాన వాటికను సందర్శిస్తుండగా తేలు కాటు వేసింది. కార్యదర్శి వికాస్‌ను కారోబార్ సురేశ్ చికిత్స కోసం స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

సంగెం : ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘగటన మండలంలోని నల్లబెల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొట్టం దామోదర్ (35) జూలై 30న ఇంటి సమీపంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అతడి సోదరుడు రాజ్‌కుమార్ స్థానికుల సహకారంతో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చేర్చగా దామోదర్ పరిస్థితి విషమించి శనివారం మృతి చెందాడు. మృతుని భార్య, కూతురు ఉన్నారు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

నాటుసారా పట్టివేత



ఖానాపురం : మండలంలోని అశోక్‌నగర్ వద్ద 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ నరేశ్‌రెడ్డి తెలిపారు. ఆయన శనివారం మీడియాకు వివరాలు వెల్లడించారు. నాటుసారా తరలుతున్నట్టు సమాచారం అందడంతో వాహనాల తనిఖీ నిర్వహించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ధరావత్ నరేశ్ ద్విచక్ర వాహనంపై నాటుసారా తీసుకెళ్తుండగా గుర్తించి అదుపులోకి తీసుకుని నాటుసారాతోపాటు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. భూక్యా నరేశ్‌పై కేసు నమోదు చేసినట్టు వివరించారు. తనిఖీల్లో ఎస్సై శార్వాణి, సిబ్బంది లింగేశ్వర్, సురేందర్, స్వర్ణలత, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కుమారస్వామి ఆదర్శప్రాయుడు

గీసుకొండ : కమ్యూనిస్టుగా నిత్యం ప్రజాసమస్యలపై పోరాడిన కందికొండ కుమారస్వామి ఆదర్శప్రాయుడని ఎంసీపీఐ(యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ అన్నారు. ఆ పార్టీ డివిజన్ అధ్యక్షుడు మంద రవి అధ్యక్షతన మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన కుమారస్వామి సంతాప సభకు అశోక్ అతిథిగా హాజరై నివాళులర్పించి మాట్లాడారు. ప్రజాఉద్యమాల్లో అమరులైన వారి త్యాగం మరువలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు గాదగోని రవి, వల్లెపు ఉపేందర్‌రెడ్డి, రాజ్ పాశ్వాన్, గోనె కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

‘ఎస్‌ఆర్‌ఆర్’ చేయూత



రాయపర్తి : మండలంలోని మైలారం గ్రామానికి చెందిన బోనాసి వెంకటలక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి ఎస్‌ఆర్‌ఆర్ ఇన్‌ఫ్రా సంస్థల అధినేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి చేయూత అందించారు. బాధిత కుటుంబానికి 75 కేజీల బియ్యం, నూనె అందించారు. అలాగే గ్రామానికి చెందిన చిర్ర రేణుక ఇటీవల మృతి చెందగా ఆమె కుటుంబానికి రూ10 వేల సాయం గ్రామస్తులతో పంపించారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదుల కంటి రవీందర్‌రెడ్డి, నాయకులు ముద్రబోయిన వెంకన్న, గబ్బెట బాబు, తదితరులు పాల్గొన్నారు.